క్లుప్తంగా

సాంఘిక నాటక కళాకారుడు మధుకిరణ్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం ఆరాధన చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం స్త్రీజన్మ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు అన్నవరపు మధుకిరణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కనుమూరి కృష్ణవేణి, కనగాల సుజాత, పతకమూరి శివకుమారి, మేడికొండలక్ష్మి, యక్కల లక్ష్మీపార్వతి, భాస్కర గీతాంజలి, సూర్యదవర లీలావతి, కనగాల వెంకటేశ్వరరావు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోండి



తెనాలిఅర్బన్: ఆహారంలో చిరుధాన్యాలు ఉండే విధంగా చూసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.సౌజన్య సూచించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా 22వ వార్డులో మంగళవారం పోషణ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాగులు, వాటి ఉత్పత్తులు వాడటం వల్ల హిమోగ్లోబిన్‌ను పెంచుకోవచ్చని చెప్పారు. పోషణ పక్వాడా పక్షోత్సవాలను ఏప్రిల్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం



తెనాలి: పట్టణ మారీసుపేటలోని స్వరలయ వేదిక కార్యాలయంలో మంగళవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. త్రిపుర మల్లు వెంకట సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డీవీ సోమయ్యశాస్త్రి సమన్వయకర్తగా వ్యవహరించారు. పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి గేయకవితను, సూరికుచ్చి బదరీనాథ్ మినీ కవితను, కాకరపర్తి సుబ్రహ్మణ్యం వచన కవిత్వాన్ని, సాయి లక్కరాజు గజల్‌ను, మోదుకూరి రాధాకృష్ణశర్మ పద్య కవితను చదివి సభను రక్తికట్టించారు. అనంతరం కవులను సత్కరించారు. ఆర్.సురేష్ పర్యవేక్షించిన సభలో మల్లేశ్వరరావు, హేమంత్, విమల్‌కుమార్, అభిక, రాజు పాల్గొన్నారు.

నిర్మలదేవి సేవలు చిరస్మరణీయం



తెనాలిఅర్బన్: సహజయోగను దేశ, విదేశాల్లో పరిచయం చేసిన నిర్మలాదేవి సేవలు చిరస్మరణీయమని సహజయోగ ధ్యాన కేంద్రసభ్యులు పేర్కొన్నారు. సహజయోగ కేంద్రం వ్యవస్థాపకులు నిర్మలాదేవి 100వ జయంతిని మంగళవారం తెనాలి సహజయోగ ధ్యాన కేంద్రం కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మార్కెట్‌లోని గాడిబావి సెంటర్‌లో నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కొప్పరావూరి కిషోర్, వి.సుబ్రహ్మణ్యం, మద్దల శ్రీను, కృష్ణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అరెస్ట్

తెనాలి రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేసి వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు. తెనాలి మండలం పెదరావూరు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏపీ చలం, ఆయన సిబ్బంది మంగళవారం గుర్తించారు. లారీ డ్రైవర్‌ను, వాహనాన్ని రూరల్ పోలీసులకు అప్పగించారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం నుంచి 30 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: దాడి కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ మండలం కోపల్లె గ్రామానికి చెందిన ధోనే నవీన్‌బాబుపై అదే గ్రామానికి చెందిన దేవరపల్లి మహేష్, కందుల వంశీ అలియాస్ స్మార్ట్ గత నెల 23వ తేదీ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలను రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

‘జగనన్న గోరుముద్ద’తో బలవర్థక ఆహారం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



రాగి పిండిని హెల్పర్‌కు అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బలవర్థక ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్దలో అనేక మార్పులు చేశారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. జగనన్న గోరుముద్దలో మంగళవారం నుంచి రాగిజావను చేర్చిన నేపథ్యంలో కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లోని విద్యార్థులకు ఎమ్మెల్యే శివకుమార్ జావను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకంపై ఉదాసీన వైఖరి చూపడం వల్ల ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి నిలిపి వాటిలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు విలువతో కూడిన విద్యను అందించడంతో పాటు వారికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత తమదేనని చెప్పారు. బాల్యదశలో విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందిస్తే వారు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థితికి చేరుకుంటారనే ఉద్దేశంతో బలవర్థక ఆహారాన్ని మెనూలో ఏర్పాటు చేసి అందిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్దలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు, రక్తహీనతను నిర్మూలించేందుకు రాగిజావ ఎంతో దోహదపడుతుందన్నారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ అందజేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం పాఠశాలలోని హెల్పర్స్‌కు రాగి పండిని అందించారు. మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ అధ్యక్షతను జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కల్లం హరికృష్ణారెడ్డి, నాయకులు బూరెల దుర్గ, గుంటూరు కృష్ణ, కఠారి హరీష్, కాళహస్తి భవాని, అక్కిదాసు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొలకలూరు హైస్కూల్లో రాగిజావ అందజేస్తున్న అనిల్‌కుమార్, శోభాదేవి



పిడపర్రులో రాగిజావను అందిస్తున్న సర్పంచ్ రత్నబాబు, ఎంఈవో లక్ష్మీనారాయణ

పిడపర్రు ఉర్దూ పాఠశాలలో..

కొల్లిపర: మండలంలోని పిడపర్రు ఉర్దూ పాఠశాల, తూములూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (రెగ్యులర్)లో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం మెనూలో మంగళవారం రాగిజావను చేర్చి ఆయా పాఠశాలల్లో ప్రారంభించారు. పిడపర్రు సర్పంచ్ దూరు రత్నబాబు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ విద్యార్థులకు రాగిజావను అందించారు. కార్యక్రమంలో తూములూరు గ్రామ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, తూములూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేదార్‌నాథ్ నరసింహారావు, ఎంపీటీసీ అవుతు బసవపున్నారెడ్డి, పిపడర్రు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షబా నా తబస్సుం, విజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులోని జెడ్పీ హైస్కూల్లో..

తెనాలిటౌన్: కొలకలూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం రాగిజావ అందించారు. కార్యక్రమాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, హెచ్‌ఎం ఎస్.శోభాదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 26వ వార్డులో ‘గడప గడపకు మన ప్రభుత్వం’

తెనాలిఅర్బన్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 26వ వార్డు మారీసుపేటలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ 26వ వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయేల్, వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 26వ వార్డులో వ్యాపార వర్గాలు, పేదలు, మధ్య తరగతి, ధనవంతులు నివాసించే వార్డు అని చెప్పారు. వార్డులో ఇప్పటి వరకు రూ.2.75 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత 110 మందికి, ఆసరా 280, సున్నా వడ్డీ 280, జగనన్న తోడు 90, అమ్మఒడి 208, పింఛన్ కానుక 225, ఇళ్ల స్థలాలు 465 మందికి ఇచ్చినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తుచేశారు. ఎన్‌సీఆర్ స్కూల్ నుంచి రేపల్లె గేటు వరకు డ్రెయిన్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు రూ.1.80 కోట్లతో నూతన డ్రెయిన్, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. కొద్ది రోజుల్లో ఈ ప్రాంతంలో దోమల సమస్యను కూడా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. 26వ వార్డులో ప్రజలు ఇచ్చిన గ్రీవెన్స్‌ను గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20 లక్షలతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నాలాది ప్రభాకర్, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, పెద్దలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్ బేగ్, ఆవుల కోటయ్య, దాసరి వీరవసంతరావు, కోమరబత్తిని జయపాల్, తోట రఘురామ్, 26వ వార్డు నాయకులు ఇశ్రత్, నాగూర్ బాబు, వెనిగళ్ల శేషురాజా, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, కోగంటి బాబ్జి, కోగంటి బాబు, కోగంటి ఆషు, రఫీ, మున్నీరు, సైదా వలీ, ఉస్మాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరెల దుర్గా, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ గఫూర్, కుక్కల ముక్తేశ్వరరావు, తాడిబోయిన రమేష్, కోలా వాసు, కాళహస్తి భవాని, చుక్కా ఆనంద్, చుండూరు వెంకటేశ్వరరావు, ఈద్గా గౌస్, పెదలంక వెంకటేశ్వర్లు, శానంపూడి రఘురామిరెడ్డి, దేవరపల్లి కిషోర్, కాళిదాసు వెంకటసత్యం, కొడాలి క్రాంతి, పినపాటి గంగయ్య, సీమోను, చుండూరు సాయి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

పవర్ లిఫ్టర్ జ్ఞానదివ్యకు రూ.30 వేల ఆర్థిక సాయం

మేము సైతం సంస్థ వితరణ

తెనాలి: కఠెవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి నాగం జ్ఞానదివ్యకు ‘మేము సైతం’ సేవా సంస్థ రూ.30 వేల ఆర్థిక సాయం అందజేసింది. కేరళ రాష్ట్రంలో వచ్చే మే నెలలో జరగనున్న ఏషియన్ సబ్‌జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహాయం చేసినట్టు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. రూరల్ మండలం నందివెలుగులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రాశాల ప్రధానోపాధ్యాయిని గోళ్ల శివపార్వతి, పీఈటీ కొల్లిపర నాగశిరీష చేతుల మీదుగా రూ.30 వేల నగదును జ్ఞానదివ్యకు అందజేశారు. మేము సైతం సంస్థ గౌరవ అధ్యక్షుడు ధూళిపాళ్ల సుధాకర్–మాధురి, ప్రధాన కార్యదర్శి షుకూర్ భాషా, అధ్యక్షుడు కళ్యాణం కళ్యాణ్‌కుమార్, బ్రహ్మజోస్యుల రాఘవేంద్ర, విష్ణు మొలకల నాగేశ్వరరావు, కళ్యాణం నరసింహారావు, అరగల సదా లక్ష్మీనారాయణ, పేరం హేమంత్ సాయి తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానదివ్యకు నగదును అందజేస్తున్న హెచ్‌ఎం, మేముసైతం సభ్యులు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే శిక్ష తప్పదు

సీడీపీవో డి.గీతాంజలి

తెనాలిటౌన్: బాల్య వివాహాలకు అనుమతి ఇచ్చేవారు, ప్రోత్సహించే వారు బాల్య వివాహ నిషేధ చట్టం కింద శిక్షార్హులని సీడీపీవో డి.గీతాంజలి పేర్కొన్నారు. తెనాలిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సీడీపీవో మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లయితే 1098, 181 హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం బాలురకు 21 సంవత్సరాలు, బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లికి అర్హత వస్తుందన్నారు. మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ ఈ చట్టం వర్తిస్తుందని చెప్పారు. సదస్సులో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు మాట్లాడారు. సెక్టారు సూపర్‌వైజర్లు కె.వెంకటలక్ష్మి, కె.సౌజన్య, హిమబిందు, కె.యామిని, పట్టణ, రూరల్ గ్రామాల్లో వివాహాలు జరిపించే మత పెద్దలు పాల్గొన్నారు.

త్వరలో ‘ఉపాధి’ మొక్కలు పంపిణీ

డ్వామా పీడీ యుగంధర్



తాడేపల్లి రూరల్: ఉపాధి హామీ పథకం కింద భవిష్యత్‌లో మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం చేపడుతున్నామని డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్ దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా డ్వామా పీడీ డాక్టర్ ఎం.యుగంధర్ మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు బాగా జరిగినట్లు వివరించారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రాసిన డీఆర్‌పీలో ప్రతి ఒక్క పనిని పొందుపరిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులు ఆనంద మోహన్, విజయలక్ష్మి, రామ్, మధుబాల, కనకారావు, లక్ష్మి పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణంలో తనిఖీ

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెం శ్రీలక్ష్మీ గణపతి ట్రేడర్స్ పురుగు మందుల దుకాణాన్ని మంగళవారం ఏఓ రమణకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో వ్యవసాయశాఖ అనుమతి లేకుండా అమ్ముతున్న బయో మందులు కిసాన్ అగ్రి టెక్నాలజీకి చెందిన(ఎక్స్‌బోనస్) 11 బాటిళ్లను తనిఖీలో కనుగొన్నారు. వాటి అమ్మకానికి అనుమతి లేనికారణంగా వాటి అమ్మకాలు నిలిపివేసేలా దుకాణాదారుడికి నోటీసు అందజేసినట్లు ఏఓ రమణకుమార్ తెలిపారు. వాటి విలువ రూ.15,840 గా నిర్ధారించి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు వాటిని ఏదుకాణంలో అమ్మకూడదని అలా అమ్మకాలు జరిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వో పుల్లారావు, వీఆర్యే గోపాలరావు ఉన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిఅర్బన్: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగ దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ పేర్కొన్నారు. బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎస్‌ఎంహెచ్ స్కూల్‌లో మంగళవారం సాయంత్రం విద్యార్థులకు యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్ కల్చర్‌ను తగ్గించుకుని యోగాను ప్రతి రోజు అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. పట్టణంలోని ఎన్‌సీఆర్, టీఎస్ఆర్, గర్ల్స్ హైస్కూల్‌లో బుద్ధ యోగ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో ఆరు నెలల పాటు యోగాపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం బషీర్ అహ్మద్ మాట్లాడుతూ రోగ నిరోధక శక్తిని పెంచుతూ ప్రతి విద్యార్థిలో కాన్ఫిడెన్స్‌ను మరింత పెంపొందిస్తుందని చెప్పారు. సమావేశంలో యోగ టీచర్లు టి.నాగదుర్గ, యామిని, లేళ్ల శ్రీ, 22వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి స్వామి, సుధారాణి, పులి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



యోగా మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: కాలంతో పాటు ప్రజలు పరుగులు పెడుతూ క్షణం తీరిక లేకుండా గడపుతూ ఎక్కువ మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నాయని, దానిని తగ్గించుకునేందుకు అందరూ ప్రయత్నించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. శ్రీరామచంద్రమిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తాలూకా జూనియర్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న యోగా మహోత్సవాల్లో మంగళవారం ఉదయం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న ప్రస్తుత రోజుల్లో 18 సంవత్సరాలు దాటిన యువకులందరిని కూడా యోగా, ఆధ్యాత్మిక చింతన, మానసిక వికాసాన్ని పెంపొందించే ప్రాంతాలకు తల్లిదండ్రులు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ కో–ఆర్డినేటర్లు రామకోటేశ్వరరావు, ఎ.కృష్ణమూర్తి, యోగ మాస్టార్ నాగేంద్ర, యోగసాధకులు పాల్గొన్నారు.

చినరావూరు పార్కులోని సమస్యలను నెలరోజుల్లో పరిష్కారిస్తా..

చినరావూరులోని సత్యనారాయణ పార్కులో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం ఆయన పార్కును పరిశీలించారు. వాకర్స్, పార్కుకు వచ్చే వారికి ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, కఠారి హరీష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆలయ విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవాలు



సీత సమేత కోదండరామస్వామి వార్లు

మంగళగిరి: నగరంలోని కాజలోని కోదండ రామస్వామి, ఆంజనేయస్వామి వార్ల ఆలయ విమాన శిఖర ప్రతిష్ఠ, మహా కుంబాభిషేక మహోత్సవాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం వివరాలను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు వెల్లడించారు. ఆలయ విమాన గోపురం పూర్తిగా శిథిలమైనందున దాతలు సింహాద్రి వెంకటరామారెడ్డి, స్వాతి దంపతులతో పునఃనిర్మాణం చేయగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొంటారన్నారు. 22వ తేదీ ఉదయం విశ్వక్సేరాధనతో ప్రారంభమై పలు పూజా కార్యక్రమాలు, 23వ తేదీ అభిషేకాలు, పూజలు నిర్వహించి, 24న ఉదయం 10 గంటల 05 నిమిషాలకు విమాన శిఖర ప్రతిష్టా మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదం వితరణ జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లకు అనుమతి తప్పనిసరి

మంగళగిరి: నగరంలో రోడ్లకు అడ్డంగా అనధికార బ్యానర్లు, ఫ్లెక్సీలు, డివైడర్లు, ప్రైవేటు గోడలపై పోస్టర్లు అంటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ యు.శారదాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్యాలయాలు, దేవాలయాలు, బ్యాంకులు, వసతి గృహాలు గోడలపై యథేచ్ఛగా సినీ, తదితర వ్యాపార ప్రకటనలు అంటిస్తూ ఆయా ఆస్తులను అందవిహీనం చేయడంతో పాటు పబ్లిక్ న్యూసెన్స్‌కు పాల్పడే వారిపై నగర పాలక సంస్థ చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. నగరపాలక సంస్థ అనుమతించబడిన పన్ను చెల్లించిన హోర్డింగులకే పోస్టర్లు పరిమితం కావాలన్నారు. నగర పాలక సంస్థ అనుమతించబడిన ప్రకటనలను మాత్రమే ముద్రణాలయాలు (వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తయారు చేసే ప్రింటర్స్) ముద్రించాలన్నారు. పలు కూడళ్లలో రోడ్లకు అడ్డంగా బ్యానర్లు కట్టడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పెయింటింగ్స్, పోస్టర్స్ ఇష్టానుసారం నగరంలో వేస్తుండటం జరుగుతుందని చెప్పారు. ఇకపై నిరంతరం పర్యవేక్షించి అనుమతి లేకుండా అంటించే వారిపై తగు చర్యలు తప్పవన్నారు. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థను పోస్టర్ ఫ్రీ ఫ్లెక్సీ రహిత నగరంగా మార్చుటకు సహకరించాలని కోరారు. ప్రింటింగ్ యజమానులు, సినిమా, విద్యా సంస్థలు, మత సంస్థల ప్రతినిధులు ప్రభుత్వ ఆస్తులపై ఎలాంటి పోస్టర్లు, పెయింటింగ్‌లు వేయరాదన్నారు. కావున ప్రజలు సహకరించి స్వచ్ఛ నగర సుందరీకరణకు సహకరించాలని కోరారు.